క్లుప్తంగా

పేదలకు దుప్పట్లు పంపిణీ



బాపట్ల: స్థానిక మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న నిరుపేదలకు హలో ప్రేయర్ టవర్ వ్యవస్థాపకుడు రెవ, గుమ్మడి ఆనంద్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ సందేశం ప్రకటించి, ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో వై.ఏబు, ఇవాంజెలిస్, యారం శేఖర్‌బాబు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు



భట్టిప్రోలు: లోక రక్షకుడు ఏసు క్రీస్తుకు స్వాగతం పలికేందుకు క్రైస్తవ సోదరులు సన్నాహాలు చేస్తున్నారు. భట్టిప్రోలులోని క్రీస్తు రక్షకుని దేవాలయం (ఆర్‌సీఎం చర్చి-క్రీస్తు భవన్) ఆధ్వర్యంలో బాల ఏసు ప్రతిమను చేతబూని పాటలు పాడుతూ పుర వీధులలో తెల్లవారుజామున తిరుగుతున్నారు. క్రిస్మస్ తాత బహుమతులు, నూతన సంవత్సర క్యాలెండర్లు అందిస్తూ ఇంటింటికి వెళ్లి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు



చెరుకుపల్లి: పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు చర్చించి, పరిష్కరిస్తామని మండల పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అల్లపర్తి ఆంజనేయులు అన్నారు. స్థానిక పెన్షనర్ల భవనంలో ఆదివారం పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మృతి చెందిన అసోసియేషన్ సభ్యులకు ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ లో మొత్తం 220 మంది సభ్యులు ఉన్నారని వారికి పింఛన్ పరంగా ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తున్నామన్నారు. 75 సంవత్సరాలు నిండిన 40మందిని పెన్షనర్స్ డే సందర్భంగా ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సి.సుబ్బారావు, కార్యదర్శి ఉల్లంగుంట శ్రీరామ్మూర్తి, విశ్రాంత ఉద్యోగులు షేక్ జిలాని, ఆర్.శివప్రసాద్, బడుగు రామారావు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

రేపల్లె: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని తమ గమ్యాన్ని చేరుకోవాలని భార్గవ్ రామ్ ఇనిస్టిట్యూట్స్ కాంపిటీటివ్ డైరెక్టర్ సీహెచ్ విష్ణువర్ధన్ అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధంమయ్యే అభ్యర్థులకు పట్టణంలోని విశాఖ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన పాల్గొని, మాట్లాడారు. లక్ష్యాల సాధనకు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక తర్ఫీదు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పలుఅంశాలను విద్యార్థులకు వివరించారు.

చిన్నారులకు స్వెట్టర్లు అందజేత



రేపల్లె రూరల్: పట్టణంలోని 24వవార్డు నేతాజీ నగర్‌లో జీసెల్ బ్లెసింగ్ మినస్టరీస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 40 మంది చిన్నారులకు స్వెట్టర్లను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకుడు కె.విజయ్‌రాజు మాట్లాడుతూ పేదలను ఆదుకోవటంలో తమ సంస్థ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

శివయ్య సన్నిధిలో భక్తిశ్రద్ధలతో హోమాలు, యాగాలు



పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాథ కుండాత్మక సప్తమ సహస్ర చండీ మహారుద్ర నవగ్రహ లక్ష్మీ గణపతి మహా యాగం క్రతువును వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. విష్ణుభట్ల ఆంజనేయ చయనుల ఆధ్వర్యంలో ఆరు రోజుల మహా యాగం, హోమాలు ఆదివారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి చండీ, రుద్ర, నవగ్రహ హోమాలు, శ్రీ చక్రార్చన, వేదపారాయణలు, బాల, సువాసినీ పూజలు, జపాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి హోమాలు, హారతి, మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి నిర్వహించారు.

చలి చంపేస్తోంది..



పొలాలపై కమ్ముకున్న పొగమంచు

- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత తప్పనిసరి

భట్టిప్రోలు: చలి రోజురోజుకీ పెరుగుతోంది. చల్లటి గాలులకు తోడు రాత్రి వేళ మంచు కురుస్తుండటంతో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడి పోతున్నాయి. ప్రస్తుతం చలి కాలంలో అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారు మంచులో తిరగకూడదు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఏడాది లోపు పిల్లలకు చలిగాలి తగలకుండా వెచ్చగా ఉండేలా చూసుకోవాలి.
- నెలల పిల్లలు తల్లి పొత్తిళ్లల్లో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి.
- ప్రయాణాల్లో చిన్న పిల్లల శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలి.
- ఆస్తమా రోగులు ఆయాసం రాకుండా ముందే మందులు వేసుకోవాలి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చలిలో తిరగకూడదు. చల్లని నీరు తాగ కూడదు.
- ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారు స్వెట్టర్, షూతో పాటు చేతులకు గ్లౌజులు ధరించాలి.
- వ్యాయామం చేయాలి. వాటి వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుంది. చమట బయటకు వచ్చి చర్మం పొడిబారకుండా ఉంటుంది.
- విటమిన్-సీ లభించే పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు ఆహారంగా తీసుకోవాలి. వాటి వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

అప్రమత్తంగా ఉండాలి



చలి కాలంలో ఆరోగ్య రక్షణకై చర్యలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి. వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్, గొంతు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు, వృద్ధులు నిద్రించే గదిలో తగిన వేడి ఉండేలా చూసుకోవాలి. ఏ విధమైన అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–చావలి రామలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, వెల్లటూరు.

2 నుంచి షిర్డీ సాయిబాబా జయంత్యుత్సవాలు



సాయిబాబా మూల విరాట్

భట్టిప్రోలు: స్థానిక రథం సెంటరులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో 79వ జయంతి వార్షికోత్సవాలు జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయని దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి మెంటా సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజు తెల్లవారు జామున ఓంకారం, నగర సంకీర్తన, సుప్రభాతం, కాకడ హారతి నిర్వహించనున్నారు. శ్రీ సాయినాధుని పాదుకలకు అభిషేకము, దత్త స్వరూపుడగు బాబా వారికి పూలతో సహస్ర నామార్చన నిర్వహించనున్నారు. వేణుగోపాల స్వామి దేవస్థానం ఆవరణలోని సాయికృష్ణ కల్యాణ కళా వేదికలో వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఆదివారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు ధనుర్మాస పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 25న దత్త జయంతి కార్యక్రమం జరుగుతుందన్నారు.సాయిబాబా మందిరంలో ప్రతిష్టించబడిన దత్తాత్రేయ స్వామి సన్నిధిలో జనవరి 4న అనఘాష్టమి పురస్కరించుకుని సామూహిక దత్తాత్రేయ, అనఘాదేవి వ్రతం నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు తెలిపారు.

విజయకీలాద్రిపై ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం



గోదాదేవి అమ్మవారి విగ్రహాన్ని ఇంటింటికి తీసుకెళ్తున్న అర్చకులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధనుర్మాస మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటచార్యులు మాట్లాడుతూ విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధనుర్మాస మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ఆదివారం శ్రీ గోదా అమ్మవారికి అష్టోత్తర శత నామార్చన, సారె సమర్పణ, నిర్వహించామని తెలిపారు. ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా ఇంటింటికి ధనుర్మాసం కార్యక్రమం చేపట్టామని, విజయకీలాద్రిపై అర్చక బృందం, శ్రీ గోదాదేవి అమ్మవారిని భగవత్ భక్తుల ఇంటికి తీసుకు వెళ్లి వారి ఇంటివద్దనే ధనుర్మాస వ్రత మహోత్సవాన్ని జరిపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదాదేవిని దర్శించుకుని, ఆమె అనుగ్రహాన్ని పొంది, తీర్థ ప్రసాదాలు స్వీకరించారని చెప్పారు.

చరిత్రను విస్మరిస్తే జాతుల మనుగడ ప్రశ్నార్థకమే

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ ఎలక్ట్ ప్రెసిడెంట్ మాజేటి సోమశేఖరరావు



మాట్లాడుతున్న సోమశేఖరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: వర్తమాన, భావితరాలకు తమ గత చరిత్రల్ని అధ్యయనం చేసే అవకాశం పాలకులు కల్పించకపోతే ఆ జాతుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ ఎలెక్ట్ ప్రెసిడెంట్ మాజేటి సోమశేఖరరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం గుంటూరు జిల్లా చరిత్ర సంఘ 29వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. చరిత్ర కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న సోమశేఖరరావు మాట్లాడారు. గతంలోని దుర్మార్గాలు, మంచి చెడుల్ని తెలియజేస్తూ భవిష్యత్ తరాల్ని నాగరిక జీవన విధానానికి తీసుకు వెళ్లేది చరిత్ర మాత్రమేనని తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన గుంటూరు జిల్లా చరిత్ర సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.శామ్యూల్ మాట్లాడుతూ ఇజ్రాయిల్, పాలస్తీనా వివాదం పరిష్కారానికి గతంలో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకువచ్చి అమలు చేయడం ఒక్కటే మార్గమని తెలిపారు. అందుకు భారతదేశం చొరవ చూపాలని కోరారు. అనంతరం కేఎల్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ బుడ్డిగ జమీందార్ వ్యాసాల సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంతెన వెంకటరాజు స్మారకోపన్యాసాన్ని వై.సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన 'విద్యా వ్యవస్థలో చరిత్ర- మార్పులు, వ్యాఖ్యానాలు' అంశంపై చరిత్ర సమీక్షకులు కొప్పర్తి వెంకటరమణమూర్తి మాట్లాడారు. 'భారత రాజ్యాంగం-లౌకికవాదం' అంశంపై సయ్యద్ అమీర్ అధ్యక్షతన ఏఎన్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అంజిరెడ్డి ఉపన్యసించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి డాక్టర్ మంచాల బోసుబాబు, డాక్టర్ పోతురాజు శ్రీనివాసరావు, సి.ఎస్.ఆర్. ప్రసాద్, పలువురు చరిత్ర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, చరిత్ర అభిమానులు పాల్గొన్నారు.

జస్టిస్ రోహిణి కమిటీ రిపోర్టు బహిర్గతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా బీసీల స్థితిగతులపై అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన జస్టిస్ రోహిణి కమిటీ రిపోర్టును బహిర్గతం చేయాలని బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ కార్యాలయంలో ఆదివారం బీసీ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు దుర్గారావు అధ్యక్షతన బీసీ నేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ బీసీల అంశంలో అన్ని రాజకీయ పార్టీలు దాటవేత ధోరణి కనపరుస్తున్నారని తెలిపారు. చట్ట సభల్లో రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి నాయకులు శరబలింగం విజయలక్ష్మి, వేణు, బుజ్జమ్మ, ప్రేమ్‌రాజ్, తాడికొండ నరసింహారావు, జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుంటూరు పార్లమెంట్ సీటు ఓబీసీలకు కేటాయించాలి

గుంటూరు పార్లమెంటు సీటును ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు కేటాయించాలని అఖిల భారత ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్ కోరారు. బ్రాడీపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ వర్గాల్లోని 139 కులాల్లో 61 కులాలు గుంటూరు పార్లమెంట్ పరిధిలో మెజార్టీ ఓటర్లుగా ఉన్న నేపథ్యంలో వారికే పార్లమెంటు సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

గురువులకు సత్కారం

తెనాలిటౌన్: అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు నేర్చుకున్న మహిళలు ఆదివారం కొల్లూరు వారి వీధిలోని సీతారామాంజనేయ దేవస్థానం ఆవరణలో గురువులు కొండపి వసుంధర, శ్రీనివాసరావు దంపతులను సత్కరించారు. అన్నమయ్య సంకీర్తనలు నేర్చుకున్న 54మంది తిరుమల నాద నీరాజనంలో సంకీర్తన గానం చేసి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వసుంధర మాట్లాడుతూ సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, మనిషిలో ఉన్న ఏకాగ్రతను భగవంతుని వైపు మరల్చడానికి సంగీతం దారిచూపిస్తుందని తెలిపారు. అందె బాలచంద్ర మౌళి, మాదాల రూపశ్రీ, అందె తన్మయి, దేవి లలిత, లక్కరాజు కనకదుర్గ, అందు రాజేశ్వరి, రామలక్ష్మి, అనిత, అన్నపూర్ణ, మౌనిక, కేశవరావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రాక

వేమూరు: వేమూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సోమవారం 10 గంటలకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి రానున్నట్లు పార్టీ శ్రేణులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారన పేర్కొన్నారు.

పంట నష్టం అంచనా పరిశీలన



వేమూరు: మిచాంగ్ తుపాను వల్ల పంటల నష్టం అంచనా ముగింపు దశకు చేరిందని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సునీత తెలిపారు. మోదుకూరులో పంట నష్టం అంచనాను ఆమె పరిశీలించారు. మండలంలోని 10,500 ఎకరాల్లో పంట నష్టం అంచనా వేసినట్లు తెలిపారు. సోమవారం కూడ పంట నష్టం అంచనా వేయనున్నట్లు చెప్పారు. మంగళవారం నుంచి జాబితా తయారు చేయడం జరుగుతుందన్నారు.

ధనుర్మాస వ్రత మహోత్సవం ప్రారంభం

తెనాలిటౌన్: పట్టణంలోని వీఎస్ఆర్ కాలేజ్ రోడ్డులో వల్లమూడి హాస్పిటల్ పక్కన స్థలంలో శ్రీ శరణాగంగోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నరేంద్రరామానుజదాస స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉత్సవాలు జనవరి 14 వరకు జరుగుతాయి. ధనుర్మాస వ్రతంతో ఉత్సవాలను రామానుజ దాస స్వామి ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 5.30గంటలకు తిరు మంజనం, 8గంటలకు అష్టోత్తర శతనామార్చన, 8.30గంటలకు తిరుప్పావై సేవ, 9.30గంటలకు గో పూజ, 10గంటలకు తీర్థ గోష్టి జరుగుతుందన్నారు. సాయంత్రం 5.30గంటలకు విష్ణు సహ స్రనామ పారాయణం, 6నుంచి 7గంటల వరకు నరేంద్ర రామానుజదాస స్వామి తిరుప్పావై ప్రవచనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



తెనాలిటౌన్: పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో శ్రీ వాసవీ మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప నామ శరణ ఘోషతో మార్కెట్ ఏరియా మారుమోగింది. 18మెట్ల పూజను జరిపారు. అయ్యప్ప మాల ధారులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు చేశారు. గురుస్వాములు మైలా సాంబయ్య, శంకర్‌స్వామి పూజను నిర్వహించారు. కార్యక్రమాన్ని బూర్లగడ్డ రామకృష్ణ, పద్మనాభుని కార్తీక్, గుర్రం చందు, గాదంశెట్టి శ్రీనివాసులు, కొత్తమాసు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

అలరించిన క్రిస్మస్ వేడుకలు



వేదికపై ఎమ్మెల్యే రఘుపతి



- పాల్ దినకరన్ దైవ సందేశం
- రాజకీయాలకు అతీతంగా క్రిస్మస్ వేడుకలు
- ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: సర్వమానవాళి రక్షణకే క్రీస్తు జన్మించడం జరిగిందని అంతర్జాతీయ సువార్తికుడు డాక్టర్ పాల్ దినకరన్ పేర్కొన్నారు. ఏబీఎం కాంపౌండ్‌లో రెండు రోజుల గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ప్రారంభించారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో డాక్టర్ పాల్ దినకరన్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. క్రీస్తు మానవాళికి చూపిన శాంతి, ప్రేమ మార్గంలో నడిచిన ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలు అధిరోహించే అవకాశం ఉంటుందన్నారు. నిస్వార్థంగా పని చేసే ప్రతి ఒక్కరికీ దేవుని దీవెనలు మెండుగా ఉంటాయన్నారు. క్రీస్తు బోధనలు అనుసరించి నడుచుకునేవారు పరలోక రాజ్యానికి వారసులవుతారని చెప్పారు. దైవ మార్గంలో నడిచే ప్రతి ఒక్కరి హృదయాల్లో ఈర్ష, ద్వేషం, అసూయలకు స్థానం లేకుండా చూసుకోవాలన్నారు.

ఎప్పటికీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుంటా..

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గత 23ఏళ్ల నుంచి బాపట్ల నియోజకవర్గంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రైస్తవ సోదరుల పట్ల తన తండ్రి కోన ప్రభాకరరావుకు అపారమైన ప్రేమ, అభిమానం ఉండేవన్నారు. ఆయన చూపిన మార్గంలోనే ఇప్పటివరకు తమ స్థోమత కొద్దీ క్రైస్తవ సోదరులకు సహాయ సహకారాలు అందిస్తూ వారిలో ఒకరిగా ఉంటున్నామన్నారు. చిన్నారులు, పాట కచేరి బృందం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు క్రైస్తవులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కారుణ్య యూనివర్సిటీ స్టూడెంట్స్ క్రిస్మస్ గీతాలాపన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘుపతి సతీమణి రమాదేవి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన ప్రారంభం



ఐలవరం(భట్టిప్రోలు): పవిత్ర ధనుర్మాస మేలుకొలుపు పురస్కరించుకుని సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం ఐలవరం పురవీధులలో నగర సంకీర్తన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి మాట్లాడుతూ ధనుర్మాసం నెల రోజులూ మహా విష్ణువును పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఈ నెల రోజులూ స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో గోత్ర నామాలతో పూజలు, గోదాదేవి, రంగనాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. నగర సంకీర్తనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డివిజన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, నగర సంకీర్తన సంఘం కన్వీనర్ కేబీవీ రమణ, కొతరపు సుబ్రహ్మణ్యం, జి.జగన్‌మోహన్‌రావు, జొన్నాదుల ఉమామహేశ్వరరావు, దీవి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత



పిరమిడ్ సొసైటీ ఫర్ స్పిరిట్యువల్ అధినేత సుభాష్ పత్రి సంస్మరణ సభలో పాల్గొన్న ప్రముఖులు

సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత

తాడేపల్లిరూరల్: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత సాధించవచ్చునని సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేవీవీ సరిత అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని మానస సరోవర ధ్యాన ఆశ్రమంలో విశ్వభారతి కూచిపూడి ఆర్ట్ అకాడమి వ్యవస్థాపకుడు నాట్య కళాశిఖామణి బిరుదాంకితులు మట్టుపల్లి కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో పిరమిడ్ సొసైటీ ఫర్ స్పిరిట్యువల్ అధినేత సుభాష్ పత్రి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. సరిత మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న అసహనం వలన సమాజంలో తలెత్తే పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రముఖ వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి మాట్లాడుతూ సంతృప్తికరమైన జీవితానికి అలవాటు పడాలని, అనవసర తాపత్రయాలకు పోకుండా ప్రశాంతంగా జీవించాలని అన్నారు. నాగార్జున యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ డీన్ డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ సంగీతం, డ్యాన్స్, అభినయం తదితర కళలను అందించేందుకు కేవలం ఆరు నెలల్లో ప్రయత్నం చేసి సాధించానని తెలిపారు. అనంతరం వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.

సమాజాభివృద్ధిలో మహిళ పాత్ర ప్రధానం

నారీ శక్తి సమ్మేళనంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జీఎస్టీ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి

గుంటూరు మెడికల్/ గుంటూరు రూరల్ : దేశవ్యాప్తంగా మహిళ సమన్వయ్ ఢిల్లీ సంస్థ ఆధ్వర్యంలో 400 ప్రదేశాల్లో ఆదివారం నారీ శక్తి సమ్మేళనం నిర్వహించారు. అందులో భాగంగా గుంటూరు లాల్‌పురం రోడ్డులోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన నారీ శక్తి సమ్మేళనం కార్యక్రమానికి జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ నాగజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ మహిళల్లో ఉన్న సుగుణాలు సమాజాభివృద్ధికి, దేశ అభివృద్ధికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో వివరించారు. నారీ శక్తి స్టేట్ కో-ఆర్డినేటర్ సాధినేని యామిని శర్మ మాట్లాడుతూ మహిళా సమాజ నిర్మాణం కోసం, పర్యావరణ పరిరక్షణ, దేవాలయాల పునరుద్ధరణ, సంస్కారవంతంగా పిల్లలని పెంచడం తదితర విషయాలపై మాట్లాడారు. ప్రతి మహిళా సమాజానికి కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ రోడ్డు సెఫ్టీ ఆవశ్యకత, సమాజంలో మహిళల పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో సెంట్రల్ ట్యాక్స్ సీనియర్ అకౌంట్ ఆఫీసర్ కల్పన, న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ, నారీ శక్తి కన్వీనర్ విజయలక్ష్మి, సహ కన్వీనర్ గీత, సామాజిక కార్యకర్త ముదిగొండ సుష్మ, ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణప్రశాంతి, ప్రముఖ న్యాయవాది విజయభారతి, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల జానపద నృత్యాలు



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణ మండపం వేదికగా సంస్కారభారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో భారత మాత పూజా దినోత్సవాల్లో భాగంగా ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో చిన్నారులు జానపద పోటీల్లో నృత్యాల్ని ప్రదర్శించి ఆహూతుల్ని అలరించారు. అనంతరం జూనియర్స్‌కు వ్యాసరచన పోటీలు, సీనియర్స్‌కు జీ-20 సదస్సుపై పోటీలు, మహాభారతంలోని అరణ్య వాసంపై అవగాహన పరీక్షలు జరిగాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసా పత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు విద్యార్థులకు చక్కటి సందేశాల్ని అందించారు.